దివ్యాంగ బాలల బంగారు భవిత

భవిత కేంద్రం.. ఇక్కడి టీచర్లే దివ్యాంగ పిల్లలకు అమ్మానాన్న. ఆకలేసినపుడు స్వయంగా తినిపిస్తారు. నిద్రొస్తే జోలపాడతారు. విద్యాబుద్ధులు నేర్పుతారు. దాంతోపాటు వారు తమకున్న వైకల్యం నుంచి బయటపడేందుకు అవసరమైన, అందుబాటులో ఉన్న ప్రతి సేవనూ అందిస్తారు. ఈ కేంద్రాల్లో విద్యా బోధన, ఆట పాటలతో పాటు అందిస్తున్న శిక్షణ సత్ఫలితాలనిస్తోంది. పరవాడలోని భవిత కేంద్రం దివ్యాంగ పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు, వారిని అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు ఎంతగానో కృషి చేస్తోంది. నేడు(డిసెంబర్ 3) అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం..

- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వరం.. భవిత కేంద్రం
- అందుబాటులో ఫిజియో, స్పీచ్ థెరపీ సేవలు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

పరవాడ: భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాలిట వరంలా మారాయి. మానసిక, శారీరక, బదిర తదితర 21 కేటగిరీల్లో ఉన్న దివ్యాంగుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచుతున్నాయి. తక్కువ లోపాలుండి, 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న దివ్యాంగ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించి ఐఈఆర్‌టీలతో ప్రత్యేక శిక్షణ, బోధన ద్వారా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్థానిక భవిత కేంద్రంలో 32 మంది దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక బోధనోపకరణాలతో శిక్షణ అందించి, వారిలో మంచి మార్పులు తీసుకొచ్చేందుకు పాఠశాల ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావులు శ్రమిస్తున్నారు.

'భవిత'తో భరోసా

స్థానిక భవిత కేంద్రం పరిధిలో మండలం మొత్తం 0–18 వయస్సు కలిగిన దివ్యాంగ విద్యార్థులు 154 మంది ఉన్నారు. వీరిలో 6–14 ఏళ్ల వయసున్న 143 మంది పాఠశాలలకు వెళ్లి, విద్యాభ్యాసం చేస్తున్నారు. 28 మందికి స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. 20 మంది శారీరక వైకల్యం ఉన్నవారు, సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న 18 మందికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. భవిత కేంద్రంలో 15 మంది ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు. 36 మంది ఎస్కార్ట్ అలవెన్స్, మరో 22 మంది ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ పొందుతున్నారు. మండలంలో భవిత కేంద్రం చొరవతో 102 మంది దివ్యాంగులు ఉపకరణాలు పొందారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి మరీ వారికి అవసరమైన సాయం అందిస్తున్నారు. ట్యాబ్స్ ద్వారా సహిత విద్యను అందించడమే కాకుండా ప్రత్యేక బోధనాభ్యసన సామగ్రితో దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నారు.

అందుతున్న సేవలు

వినికిడి, దృష్టి లోపం, అంగవైకల్యం, గ్రహణం మొర్రి, మూగ తదితర ప్రత్యేక అవసరాలున్న చిన్నారులు భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. పిల్లల్లో సమస్యను చిన్నతనంలోనే గుర్తించి, భవిత కేంద్రాల్లో చేర్పించి వారికి అవసరమైన శిక్షణను అందిస్తున్నారు. వినికిడి లోపం, మాటలు రాని పిల్లలకు పరికరాలను అమర్చడంతో పాటు స్పీచ్ థెరపీ చేయిస్తున్నారు. అవయవ లోపం ఉన్న చిన్నారులకు ఫిజియోథెరపీ ద్వారా నయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చిన్నారులతో రాయించడం, పాటలు, డ్యాన్స్, చిత్రలేఖనం తదితర అంశాల్లో వారిని ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికి తీస్తున్నారు. అంధులకు బ్రెయిలీ లిపిపై అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు చిన్నారుల మానసిక స్థితికి అనుగుణంగా వారిలో విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు.


భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


దివ్యాంగ విద్యార్థికి ఇంటి వద్దే చదువు చెప్తున్న స్పెషల్ టీచర్ కుమారి


ట్యాబ్స్ ద్వారా సహిత విద్యను అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయ బృందం


భవిత కేంద్రంలో రాష్ట్ర సహిత విద్య అధికారులు శ్రీరామకమల్, నరసింహన్(ఫైల్)



ప్రత్యేక అభ్యసన సామగ్రితో విద్యను నేర్చుకుంటున్న దివ్యాంగ బాలిక

ప్రత్యేక వేడుకలు నేడు

భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఆటలు, పాటలు, డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పోటీలు జరిగాయి. మంగళవారం మిగిలిన వారికి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన పిల్లలకు ఈ రోజు జరిగే ప్రత్యేక వేడుకలో తల్లిదండ్రులు, అతిథుల సమక్షంలో బహుమతులు అందించనున్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సౌకర్యాన్ని దివ్యాంగ చిన్నారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో నెలలో నాలుగు సార్లు ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో 0–18 సంవత్సరాలోపు వయసున్న దివ్యాంగ పిల్లల్ని గుర్తించి, వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా భవిత కేంద్రాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. –జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, అనకాపల్లి

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో సినీనటుడు రవిప్రకాష్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ నటుడు రవిప్రకాష్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం తర్వాత, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

గిరిజన దీక్షాధారులకు దీక్ష వస్త్రాల పంపిణీ


దీక్షధారులకు దీక్ష వస్త్రాలు అందిస్తున్న సింహాద్రి మఠం గురుస్వామి సురేంద్ర

సింహాచలం: సింహగిరిపై సోమవారం జరిగిన 41రోజుల శ్రీ నృసింహ దీక్షాధారణ కార్యక్రమంలో తొలిసారి దీక్ష తీసుకున్న గిరిజన భక్తులకు స్థానిక సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్ర దీక్షా వస్త్రాలను ఉచితంగా అందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన చింతపల్లి, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు తదితర మండలాలకు చెందిన గ్రామాల నుంచి 200 మంది గిరిజనులు సింహగిరిపై తొలిసారిగా శ్రీనృసింహ దీక్ష తీసుకున్నారు. వీరికి సింహాద్రి మఠం తరఫున పురుషులకు పంచె, కండువా, చొక్కా క్లాత్, మహిళలకు చీర, కండువాను సురేంద్ర అందించారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పరవాడలో వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

పరవాడ: నర్సీపట్నంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల నాయకురాలు పి.మాణిక్యం కోరారు. పరవాడలో మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ నర్సీపట్నంలో జరిగే జిల్లా మహాసభలో పరవాడ ఫార్మా పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని, భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. స్థానిక ఫార్మా నిర్వాసితులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించి, అధిక ధరలను నియంత్రించి, మహిళలపై జరుగుతున్న హింసను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ, ఫార్మా కాలుష్యంలో చిక్కుకున్న స్వయంభూవరం, సోమునాయుడుపాలెం, తాడి గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు వెంకటలక్ష్మి, అరుణ, జయ, పార్వతి పాల్గొన్నారు.

వుడా భూ సమస్య పరిష్కారానికి వినతి


ఎమ్మెల్యేకు సమస్య నివేదిస్తున్న వేపగుంట వుడా భూ సమస్య బాధితులు

పెందుర్తి: జీవీఎంసీ 94వ వార్డు పరిధి వేపగుంటలో దీర్ఘకాలికంగా ఉన్న వుడా భూ సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కోరారు. సోమవారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసి తమ సమస్యను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య ఇదివరకే తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కరించే దిశగా ప్రభుత్వ పెద్దలను కోరతామని భరోసానిచ్చారు. కార్పొరేటర్ బల్ల శ్రీనువాసరావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతో పర్యావరణ పరిరక్షణ


పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు


విత్తన బంతులు విసురుతున్న విద్యార్థులు

- జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం కొండల్లోకి విత్తన బంతులు

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు పిలుపునిచ్చారు. గోపాలపట్నానికి చెందిన జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైస్కూల్ విద్యార్థులతో పాఠశాల పక్కనే ఉన్న సింహగిరి కొండల్లోకి విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉసిరి, సీతాఫలం, సపోటా, రావి, చింత, వెదురు తదితర విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులను విద్యార్థులు ఉత్సాహంగా కొండల్లోకి విసిరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పైడిరాజు మాట్లాడుతూ రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటోందన్నారు. దీంతో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మనతో పాటు భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు చెట్లని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. పేడ, మట్టితో కలిపిన విత్తనబంతులను వేయడం ద్వారా త్వరితగతిన మొక్కలు వస్తాయన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన జేడీ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రామచంద్రనాయుడు, ఉపాధ్యాయులు కృష్ణ, పద్మావతి, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఖోఖోలో విస్తం విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న విస్తం ప్రిన్సిపాల్ శివకుమార్, కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల పురుషుల ఖోఖో జట్టు ప్రతిభ కనబరిచింది. 28 కళాశాలల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థి బి.కిరణ్ సౌత్ జోన్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఆనంద్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

మొబైల్ వైద్య సేవల్ని వినియోగించుకోండి


వెన్నలపాలెంలో మొబైల్ వైద్య సేవల్లో ఎన్టీపీసీ ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ డి.ప్రశాంత్ ప్రణీత్‌కుమార్ తెలిపారు. వెన్నలపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చన్నారు. ఎన్టీపీసీ సహకారంతో హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా మండలంలోని 29 గ్రామాల ప్రజలకు మొబైల్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ ద్వారా సింహాద్రి ఎన్టీపీసీ పరిసర గ్రామాల ప్రజలకు ప్రతి వారం బీపీ, మధుమేహం, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, చర్మ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. మంచం పట్టిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ పైల సన్యాసిరావు, పి.వి.నరసింగరావు, వెన్నల ఈశ్వరరావు, బి.నాయుడు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయినికి సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన పినాకపాణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

సబ్బవరం: అంకిత భావంతో పనిచేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయిని దార్లపూడి పినాకపాణి అని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ కొనియాడారు. మండలంలోని వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన పినాకపాణిని పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 37 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కువ కాలం సబ్బవరం మండలంలోనే విధులు నిర్వర్తించారన్నారు. పాఠశాల హెచ్‌ఎం బి.హేమలత మాట్లాడుతూ పినాకపాణి ఉద్యోగ విరమణ చేయడంతో విద్యాబోధనలో ఆమె లేనిలోటు పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బీవీ రమణ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు భాస్కర్, హేమంత్, ప్రసాదరావు, తమ్మారావు, రమణ, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, గవర రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి


పినగాడి శివాలయం కోనేరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- శివాలయాల కోనేర్లలో దీపారాధనలు
- ఘనంగా అన్నసమారాధనలు

పెందుర్తి: కార్తీకమాసం ముగింపు, పోలి పాడ్యమి సందర్భంగా నియోజకవర్గంలో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసింది. మహిళలు భక్తిశ్రద్ధలతో శివాలయాల కోనేర్లు, గ్రామాల్లోని చెరువుల్లో ప్రత్యేక పూజలు జరిపి దీపారాధనలు చేశారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వందలాది మంది భక్తులు మహాశివునికి పూజలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. అర్చనలు చేశారు. కోనేరులో దీపారాధన చేశారు.
- జుత్తాడ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. దాదాపు 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.
- సరిపల్లిలోని శివాలయంలో భక్తులు స్వహస్తాలతో శివునికి క్షీరాభిషేకాలు జరిపారు. మహానంది, ధ్వజ స్తంభాలకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. కోనేరులో దీపారాధన చేశారు.
- కృష్ణరాయపురంలోని శివాలయం, ప్రశాంతి నగర్, చింతలగ్రహారం శివాలయం, సుజాతనగర్‌లోని హరిహరక్షేత్రం, పెందుర్తి మహాకామేశ్వరి అమ్మవారి ఆలయంలోని జ్యోతిర్లింగాల సన్నిధిలో ఘనంగా పూజలు జరిగాయి.
- శ్రమశక్తినగర్‌లో జరిగిన అన్నసమారాధనను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్ సేనాపతి వసంత చేతుల మీదుగా ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.
- 95వ వార్డులోని పలు దేవాలయాల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నసమారాధన ప్రారంభించారు.


అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

'పెందుర్తి తహసీల్దార్, జీవీఎంసీ ఏఈలపై చర్యలు తీసుకోవాలి'



విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నాయకులు

మహారాణిపేట: జీవీఎంసీ పరిధి 96వ వార్డులోని చినముషిడివాడ కొండపై జరుగుతున్న అక్రమ తవ్వకాలను నిలిపి, ప్రజల నివాసాలకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం(ఎంఎన్ఎస్ఎస్), ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వినతి పత్రం అందించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వార్డులోని సర్వే నెం.113లో కొండను ఆక్రమంగా తవ్వుతూ నెంబర్లు లేని లారీలతో గ్రావెల్‌ను తరలిస్తున్నారని ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన తహసీల్దార్ మౌనంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆదివారం కూడా ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు యథేచ్ఛగా కొండను తొలుస్తూనే ఉన్నా చర్యలు తీసుకోలేదన్నారు. వినతులు ఇస్తున్నా పట్టించుకోవట్లేదని ఆరోపించారు. అధికారుల సహకారంతో తవ్వకాలు చేస్తున్నట్లు వారు చెప్తున్నారని, ఇందుకు ప్రోత్సహిస్తోన్న తహసీల్దార్, జీవీఎంసీ ఏఈలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ నగర్ మురికివాడ నివాసుల సంక్షేమ సంఘానికి చెందిన ఎస్.వెంకటలక్ష్మి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని పెదనరవ ప్రాంతంలో అనారోగ్యానికి గురైన ఓ గుర్తు తెలియని మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నరవ ప్రాంతంలో రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో ఉన్న మహిళ(50)ను స్థానికుల సమాచారంతో పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సమాచారం తెలిసిన వారు 94407 96039, 99081 66714 నంబర్లలో సంప్రదించాల్సిందిగా సీఐ కోరారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.60 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 4 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 4 వినతులు అందాయి. 95వ వార్డులో కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అదే వార్డులో యూజీడీ పైప్‌లైన్ పనుల కోసం, 93వ వార్డులో కాలువలు, రోడ్ల నిర్మాణం కోసం, అదే వార్డులోని దుర్గానగర్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని జోనల్ కమిషనర్ హైమావతికి ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి వాటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.